క్లుప్తంగా

ప్రత్యేక వైద్య శిబిరానికి స్పందన



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

గాజువాక : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరానికి స్పందన లభించింది. గాజువాక పీహెచ్‌సీలో నిర్వహించిన ఈ శిబిరాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్‌లపై స్త్రీల వైద్య నిపుణులు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. వీటితోపాటు మరో 388 మందికి బీపీ, సుగర్, జనరల్ మెడిసిన్, కంటి పరీక్షలు, టీబీ స్క్రీనింగ్, ల్యాబ్ టెస్టులు తదితర వైద్య సేవలను అందించారు. కార్యక్రమంలో వైద్యులు బదిరీ నారాయణ, శ్రీదేవి, కె.ఎస్.సరళ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

60 బీరు బాటిళ్ల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బీరు బాటిళ్లు

గాజువాక : గాజువాక పోలీసులు స్థానిక హైస్కూల్ రోడ్‌లో శనివారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 45 వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు పత్రాలు లేని ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో భాగంగా ఎర్రబెల్లి భద్రరాజు ఇంట్లో పోలీసులు తనిఖీ చేసి అక్రమంగా నిల్వ ఉంచిన 60 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు గాజువాక సీఐ పార్థసారథి తెలిపారు. అక్రమ మద్యం నిల్వపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పైడిమాంబ ఆలయంలో ఘనంగా భవానీల పూజలు



పెదమడక పైడిమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న భవానీలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పెదమడక గ్రామదేవత పైడిమాంబ ఆలయంలో భవానీలు ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో పీఠం ఏర్పాటు చేసిన భవానీలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలాచరించారు. ఈసందర్భంగా గురుస్వామి వాసు మాట్లాడుతూ దశాబ్దన్నరగా పైడిమాంబ భవానీ పీఠం ఏర్పాటు చేస్తున్నామని, మూడు వారాల పాటు పూజలు నిర్వహించి అనంతరం విజయవాడ దుర్గా మల్లేశ్వరి ఆలయంలో మొక్కులు తీర్చుకోనున్నామన్నారు.

చేతి వృత్తిదార్లకు పరికరాల పంపిణీ



లబ్ధిదారులకు టూల్ కిట్లను అందజేస్తున్న కరణంరెడ్డి

గాజువాక :ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా మంజూరైన ఉచిత పరికరాలను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు పంపిణీ చేశారు. బీహెచ్‌ఈఎల్ పోస్టాఫీసు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు కార్పెంటర్లకు పరికరాలు, రజకులకు వాషింగ్ మెషీన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా గాజువాక ప్రాంతంలో రెండు వేలమందికి పైగా లబ్ధి పొందారన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికీ రూ.15 వేలు లబ్ధి చేకూరుతోందన్నారు. వారికి గతంలో వారం రోజులపాటు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం తరపున సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కానూరు అప్పలరాజు, చంద్ర శేఖర్, రాముునాయుడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనం
- పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం
- అర్హత పరీక్షకు దరఖాస్తులకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం
- ఎంపికైతే ఏడాదికి రూ.12 వేల స్కాలర్‌షిప్



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

NMMS పేద విద్యార్థుల చదువుకు బాసట

పెదగంట్యాడ: పాఠశాల విద్యలో 7వ తరగతి నుంచి పదో తరగతి ఎంతో కీలకం.. పదో తరగతి పూర్తయిన తర్వాత ఇంటర్ కూడా ఎంతో ముఖ్యం.. అయితే పేదరికం.. ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఎంతోమంది విద్యార్థులు 7 నుంచి పదో తరగతి వరకూ చదువు మధ్యలో చదువుకు దూరం అవుతున్నారు.. ఆ వయసులోనే పనులకెళ్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. అయితే చదువును మించి ఆస్తి లేదని.. పేదరికంతో గానీ ఆర్థిక ఇబ్బందులతో గానీ ప్రతిభ ఉన్నా చదువుకు దూరం కాకూడదనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది.. పేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందిస్తోంది. వారిలో ఉత్సాహం నింపుతోంది.

డ్రాపౌట్స్‌ను నివారించేందుకు..

ప్రభుత్వ పాఠశాలల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే అత్యధికంగా చదువుతూ ఉంటారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మధ్యలోనే బడి మానేసి విద్యకు దూరమవుతున్నారు. దీంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులు చదువులు కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాన్ని అందిస్తూ సహకారం అందిస్తోంది. ఏటా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తోంది. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఈ పరీక్షలో సత్తా చాటిన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ ఏటా రూ.12వేలు వంతున ఉపకార వేతనాన్ని అందజేస్తున్నారు.

దరఖాస్తు గడువు సెప్టెంబర్ 30

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఈ నెల 30 వరకూ తుది గడువును నిర్ణయించారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటోంది.

అర్హులు ఎవరంటే..

ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 7వ తరగతిలో ఓసీ, బీసీ విద్యార్థులు 55శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50శాతం లేకపోతే దానికి సమానమైన గ్రేడ్ పొందిన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. అలాగే విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించకుండా ఉండాలి.

ఏడాదికి రూ.12వేలు

ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులు. ఈ స్కాలర్‌షిప్ పరీక్షలో ప్రతిభ చూపిన ప్రతి విద్యార్థికి 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకూ ఏడాదికి రూ.12వేలు చొప్పున స్కాలర్ షిప్ అందజేస్తారు. అర్హత సాధించిన విద్యార్థులు జాతీయ బ్యాంక్‌లో ఖాతా ఓపెన్ చేసి వివరాలు పొందుపర్చాలి.

పరీక్ష ఇలా..

రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకొని విభాగాల వారీగా అర్హుల జాబితాను తయారు చేస్తారు. ఇందులో రెండు ప్రశ్నాపత్రాలు ఉంటాయి. మూడు గంటల పాటు పరీక్ష సమయాన్ని కేటాస్తారు. మెంటల్ ఎబిలిటీ, వెర్బల్, నాన్ వెర్బల్, రీజనింగ్ నుంచి 90 ప్రశ్నలు ఉంటాయి. దీనికి 90 మార్కులు ఇస్తారు. స్కాలిసిస్ అప్టిట్యూట్ పరీక్షలో 7, 8వ తరగతుల స్థాయిలో విద్యార్థులు నేర్చుకున్న మ్యాథ్స్, సామాన్య, సాంఘిక విషయాలపై ప్రశ్నలు ఇస్తారు. ఈ రెండూ కలిపి 180 మార్కులకు ఉంటాయి.

పేద విద్యార్థులకు వరం



నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పేద విద్యార్థులకు వరం. మా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు గత నాలుగేళ్లగా సత్తా చాటుతున్నారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికవుతున్నారు. ఇప్పటి వరకూ మా పాఠశాల నుంచి 86 మంది ఈ స్కాలర్‌షిప్‌ను పొందుతున్నారు. విద్యార్థులను ఆ మేరకు తీర్చిదిద్దుతున్నాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– రాచకొండ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, పెదగంట్యాడ



నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ 3వ ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ రద్దు చేయాల్సిందే



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు తదితరులు

గాజువాక : అదానీ గంగవరం పోర్టుకు సమీపంలో ఏర్పాటు చేయనున్న అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. గాజువాక సీపీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెదగంట్యాడలో 20 వేల ఎకరాల భూమిలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. పెదగంట్యాడ, గాజువాక, మల్కాపురం, ఎన్ఏడీ వరకు ఈ ఫ్యాక్టరీ ప్రభావం ఉంటుందన్నారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే పది లక్షల మంది అనారోగ్యాల బారిన పడతారన్నారు. ఇప్పటికే గంగవరం పోర్టు కాలుష్యం కారణంగా స్థానిక ప్రజలు అనేక రకాల జబ్బులకు గురవుతున్నారని, వివిధ దుష్ప్రభావాలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అందువల్ల ఈ సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ కోసం వచ్చేనెల 8న జరగనున్న పబ్లిక్ హియరింగ్‌లో ప్రజానీకం పాల్గొని నిరసన తెలపాలన్నారు. ఈ ఫ్యాక్టరీ రద్దు చేసే వరకు అనేక రూపాల్లో పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ ఇప్పటికే ఇలాంటి కంపెనీని ఒడిస్సాలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారని, అక్కడి ప్రజలు వ్యతిరేకించారని అన్నారు. కూటమి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఈ విషయాలపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. వీటిపై కూటమి నాయకులు స్పందించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఎస్.రామారావు, పైడిరాజు, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

315 మంది మహిళలకు వైద్య సేవలు



ఉచిత వైద్య పరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

అగనంపూడి: స్వస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్లో భాగంగా అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రిలో నిర్వహించిన ప్రత్యేక మహిళా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో గర్భిణులు, పిల్లలు, టీబీ, ఎన్‌సీడీ, జనరల్ ఫిజిషియన్, నేత్ర, దంత, ఈఎన్‌టీ, చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, ఏపీవీవీపీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ పి.శంకర్ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.మొత్తం 315 మంది మహిళలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరంలో 10 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ, పరిపాలనాధికారి రవిరాజుతో పాటు ఆసుపత్రి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: ఇటీవల తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు స్టీల్ ప్లాంట్ యాజమాన్యాన్ని కోరారు. శనివారం హెచ్‌ఆర్ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో వారు ఈ మేరకు తమ డిమాండ్లను వినిపించారు. నిర్వాసితులైన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వారి ఆధార్ కార్డు బ్లాక్‌ను తొలగించాలని నాయకులు కోరారు. ఎమ్మెల్యే, కలెక్టర్ సూచించినప్పటికీ కార్మికులను తిరిగి నియమించకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందిస్తూ, కార్మికుల సమస్యలను ఉన్నత యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో ప్లాంట్ పర్సనల్ ఇన్‌ఛార్జ్ ఎన్.భాను, డీజీఎంలు డాక్టర్ రాధిక, సువేందు ఖర్, కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, మంత్రి రవి, వంశీ కృష్ణ, భాస్కరరావు, వి. అప్పారావు, జి. సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో ఆక్రమణల కూల్చివేత.. స్వల్ప ఘర్షణ



గాంధీబొమ్మ వద్ద ఆక్రమణలు కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది



వడ్లపూడి కూల్చివేతలు వద్ద గుమికూడిన జనం

కూర్మన్నపాలెం: రహదారి ఆక్రమణలను తొలగించేందుకు జీవీఎంసీ ప్రణాళిక విభాగం అధికారులు శనివారం వడ్లపూడిలో విస్తృత కూల్చివేతలు చేపట్టారు. ఈ క్రమంలో, దుకాణదారులు, ఆక్రమణదారులతో స్వల్ప ఘర్షణలు జరిగాయి. జీవీఎంసీ అధికారులు తమ సిబ్బందితో కలిసి వడ్లపూడి ప్రధాన రహదారికి చేరుకుని రెండు బృందాలుగా విడిపోయారు. ఒక బృందం గాంధీ బొమ్మ వద్ద, మరో బృందం వడ్లపూడి ప్రధాన కూడలి వద్ద కూల్చివేతలను ప్రారంభించింది. సచివాలయ సముదాయం సమీపంలో, కొన్ని దుకాణాల యజమానులు ముందస్తు సమాచారం లేకుండా ఎలా తొలగిస్తారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ రెండు రోజుల ముందే నోటీసులు జారీ చేశామని, అయినా ఎవరూ స్పందించకపోవడంతో చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని వివరించారు. అయితే, తమ రేకు షెడ్లు, బోర్డులను స్వయంగా తొలగించుకోవడానికి అవకాశం ఇవ్వాలని యజమానులు కోరడంతో అధికారులు అంగీకరించారు. దీంతో తొలగింపు కార్యక్రమం సులభతరంగా సాగింది. చాలా చోట్ల దుకాణదారులు తమంతట తామే ఆక్రమణలను తొలగించుకున్నారు.

హెచ్‌ఆర్‌లో ఏఐ వినియోగం ప్రయోజనకరం



సెమినార్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ఎన్ఐపీఎం ప్రతినిధులు

ఉక్కునగరం: హెచ్‌ఆర్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగించడం వల్ల హెచ్‌ఆర్ నిపుణులకు ప్రయోజనం చేకూరుతుందని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ ఎస్.సి. పాండే అన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పర్సనల్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీఎం) విశాఖపట్నం చాప్టర్, హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎస్‌డీఐ) సంయుక్తంగా శనివారం నిర్వహించిన 'ఏఐ సవాళ్లు, ఉత్తమ పద్ధతులలో హెచ్‌ఆర్‌ను మార్చడం' అనే అంశంపై ఒక రోజు సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేర్చుకోవడం అనేది నిరంతర ప్రక్రియ అని, వ్యక్తుల శక్తిసామర్థ్యాలపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయని చెప్పారు. జాతీయ ఆర్థికాభివృద్ధిలో హెచ్‌ఆర్ ముఖ్యపాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. ఎన్ఐపీఎం ఇతర సంస్థలతో కలిసి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పరస్పర జ్ఞాన మార్పిడి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌సీఐ మాజీ చైర్మన్ డాక్టర్ ఈమంది శంకరరావు, ఎన్ఐపీఎం జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ మురళీధరరావు, చాప్టర్ చైర్మన్ బి. శేషగిరిరావు, వైస్ చైర్మన్ అర్షద్ ప్రసంగించారు. చాప్టర్ కార్యదర్శి డాక్టర్ బి. కృష్ణ కుమారి వందన సమర్పణ చేశారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



మాసశివరాత్రి సందర్భంగా ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అగనంపూడి: భాద్రపద బహుళ చతుర్దిని పురస్కరించుకొని మాస శివరాత్రి సందర్భంగా 85వ వార్డులోని పెదమడకలో ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారికి పంచామృతా భిషేకం, అలంకరణ చేసి, ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అగనంపూడి పరిసర ప్రాంతాలైన పెదమడక, కొండయ్యవలస, డొంకాడ, పినమడక, బీసీ కాలనీ, శనివాడ, గల్లవానిపాలెం, ఫార్మాసిటీ కాలనీలు, లంకెలపాలెంల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అభిషేకాలు, పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం స్వామి వారికి అన్న ప్రసాద వితరణ చేపట్టారు. అగనంపూడికి చెందిన హరిబాబు కుటుంబ సభ్యుల సహకారంతో ఈ అన్న సమారాధన జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దానబాల అప్పలనాయుడు, అమరపిని సోమేశ్వరరావు, కరణం సన్ని, కొలిపాక అప్పారావు, గుదే అప్పలరాజు, గొట్యాడ నగేష్, దానబాల గోపాలకృష్ణ, ఎల్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పనిని దైవంగా భావించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, ప్రకాశరావు

పెదగంట్యాడ : పనిని దైవంగా భావించినప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలమని శ్రీ సత్యసాయి సేవా సమితి ఉక్కునగరం ప్రతినిధులు జి.శ్రీనివాసరావు, కె.ప్రకాశరావు అన్నారు. మండలంలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'పనే దైవం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువును కూడా ఒక పనిగానే భావించి, దానిపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అలా చేస్తేనే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం గేదెల ప్రమీల మాట్లాడుతూ, విద్యార్థులు తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో, శ్రద్ధతో, ఏకాగ్రతతో నిర్వర్తించడమే నిజమైన విధి అన్నారు. పనిని దైవంగా భావించేవారి జీవితం సుఖవంతంగా, ఆనందమయంగా ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ హక్, ఆనందరావు, అరుణ, రమాదేవి, రామలక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

అగనంపూడి: పిడుగుపాటుకు గురై మృతి చెందిన తలారివానిపాలెం వాసి సర్వసిద్ధి నూకరాజు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందింది. నాలుగేళ్ల క్రితం ఈ విషాద ఘటన జరిగింది. వార్డు టీడీపీ అధ్యక్షుడు ఈ విషయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో, సీఎం కార్యాలయం నుంచి తక్షణమే స్పందన లభించింది. మృతుడి భార్య దేముడమ్మ, కుమారుడు నరసింగరావు, కుమార్తె వెంకటలక్ష్మిల పేరిట రూ.3 లక్షల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును దోసేంద్ర కుటుంబ సభ్యులకు అందజేశారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లయ్య

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న జరగనున్న సదస్సును జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షులు బి.తాడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య కోరారు. శనివారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 'వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ ప్రభావం-కర్తవ్యం' అనే అంశంపై ఈ సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర మాజీ ఐఏఎస్ జి.ఎస్.ఆర్.కె.ఆర్. విజయకుమార్ ముఖ్య వక్తగా హాజరవుతున్నారని చెప్పారు. ప్రైవేటీకరణ వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై ఈ సదస్సులో చర్చించి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటామని నాయకులు తెలిపారు. ఈ నిర్ణయాలను భారత రాష్ట్రపతి, కేంద్ర ఉక్కు మంత్రి, ఎంపీలు, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు నివేదిస్తామన్నారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించేందుకు అవసరమైన నివేదికలను కూడా తయారు చేసి సమర్పిస్తామని వివరించారు.ఈ సదస్సులో స్టీల్ ప్లాంట్ విశ్రాంత అధికారులు కొల్లాబత్తుల సత్యం, టి.కె.ఎస్.ఆర్. టాగూర్ తో పాటు పలువురు ప్రత్యేక అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. సెక్టార్-1లోని స్టీల్ క్లబ్‌లో అదేరోజు సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ సమావేశానికి స్టీల్ ప్లాంట్ ఉద్యోగులందరూ హాజరు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎస్. మోహన్‌బాబు, డి. పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపరింటెండెంట్ గోపీకృష్ణ

అగనంపూడి: ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచడానికి రోగులు, వారి బంధువులు సహకరించాలని ఏపీవీవీపీ జిల్లా సమన్వయకర్త టి.శంకర్ ప్రసాద్ కోరారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అగనంపూడి ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛ ఆస్పత్రి కార్యక్రమంలో ఆయన ఈ మేరకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు, తినుబండారాల చెత్తను కేవలం నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వేయాలని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ మాట్లాడుతూ, రోగుల తాకిడి పెరిగినందున అందరూ స్వచ్ఛత పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.




పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో చెత్తను తొలగిస్తున్న సీఐ పార్థసారథి తదితరులు

గాజువాక పోలీస్ స్టేషన్ వద్ద...

గాజువాక : స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో భాగంగా గాజువాక పోలీస్ స్టేషన్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. వాటి రక్షణకు కంచెలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాంగణంలో పిచ్చి మొక్కలను, చెత్తలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు రవికుమార్, హరికృష్ణ, నజీర్, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ సభ్యులకు 18 శాతం డివిడెండ్



త్రిఫ్ట్ సొసైటీ మహాజన సభలో పాల్గొన్న పాలకవర్గం

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ తమ సభ్యులకు 18 శాతం డివిడెండ్‌ను ప్రకటించింది. స్టీల్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన 62వ మహాజన సభలో ఈ నిర్ణయాన్ని ఆమోదించారు. సొసైటీ కార్యదర్శి డి. శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ రూ. 2.64 కోట్ల నికర లాభం ఆర్జించిందని, ఈ ఏడాది కూడా ఆడిట్ వర్గీకరణలో 'ఎ' గ్రేడ్ సాధించిందని తెలిపారు. అధ్యక్షుడు కె. ఆనందకుమార్ మాట్లాడుతూ 9,548 మంది సభ్యులు, రూ.257 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలోనే అతిపెద్ద సొసైటీగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. కోశాధికారి కొండరాజు గత ఏడాది ఆర్థిక నివేదికలు, సవరించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇకపై మెయిన్ లోన్ ష్యూరిటీ పరిమితిని 3 నుంచి 4కు, మీడియం టర్మ్ లోన్ ష్యూరిటీ పరిమితిని 2 నుంచి 3కు పెంచాలని సభలో నిర్ణయించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎంవీ రమణ, కె. శ్రీనివాస్, పీజీకే రాజు, చీఫ్ మేనేజర్ కె. దామోదరరెడ్డి పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
O.S.No.462/2018.

Between: Sri Siruvuri Narayana Raju @ Chanti. ...Plaintiff
And: Jampana Varma Raju (died), etc., ...Defendants.
To:

<u>The 5th Defendant:</u>
Smt. Jampana Devi, W/o late VarmaRaju, Block No.25, Railway Colony, Near Duvvada Railway Station, Duvvada, Visakhapatnam District.

<u>The 6th Defendant:</u>
Smt. Jampana Neekhitha, D/o late Varma Raju, Block No.25, Railway Colony, Near Duvvada Railway Station, Duvvada, Visakhapatnam District.

<u>The 7th Defendant:</u>
Smt. Jampana Leekhita, D/o late Varma Raju, Block No.25, Railway Colony, Near Duvvada Railway Station,Duvvada, Visakhapatnam District.

Please take notice that the above suit is filed by the plaintiff against you and other defendants, which is posted to 13-10-2025 and you have directed to appear before the said Honourable Court at 10-30A.M. either personally or through an advocate, failing which the matter will be decided in your absence with the material available on record.

ADVOCATE FOR THE PLAINTIFF.
K.V.N. THAMMANNA SETTY
ADVOCATE, M.A. LL.B.,
Ex.Government Pleader,
Ex.Municipal Standing Counsel,
Plot No.23, Mahalakshmi Nagar,
VIZIANAGARAM-535002.